మన మీ..
# వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం

TGBIL/25/A0512

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం
24 ఆగస్టు 2026

పేజీలు : 4

@mvaartanews
www.mivaartanews.com

## 25న జరిగే సర్పంచ్ ల చైతన్య సదస్సును జయప్రదం చేయండి.

- సర్పంచ్ ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి.
- విలేకరుల సమావేశంలో పంచాయతీ రాజ్ చాంబర్స్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పుసులూరి నరేందర్.




**ఖమ్మం ఆగస్టు 23 మీ వార్త ప్రతినిధి:** ఈనెల 25న ఖమ్మంలోని లకారం ట్యాంక్ బండ్ లేక్ యు క్లబ్ లో జరిగే తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ ఖమ్మం జిల్లా సర్పంచ్ ల చైతన్య సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్స్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కుసులూరి నరేందర్ పిలుపునిచ్చారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నరేందర్ మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలంటే తొలుత గ్రామాల అభివృద్ధి జరగాలని, గ్రామాలు శక్తివంతంగా స్వచ్ఛందంగా పచ్చదనంగా ఉంటేనే ఈ దేశం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. 79 ఏండ్ల స్వాతంత్ర భారతదేశంలో స్థానిక సంస్థల గ్రామ పాలన రోజు రోజుకు దిగజారి పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మాత్మ గాంధీ తన కళ్ళలను సహకారం చేసుకునేందుకు గ్రామాలను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అందుకు అవసరమైన నిధుల కేటాయింపులు సర్పంచ్ పాలనకు కేటాయింపులు చేయాలని కోరారు. చెక్కు పవర్ గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శికి ఉండాలని, 73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా 243 జి లో ఆర్టికల్లోని 11వ షెడ్యూల్లో పొందుపరిచిన 29 అంశాలను పంచాయతీలకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లో 50 శాతం నిధులను గ్రామపంచాయతీలకు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన రిజిస్ట్రేషన్లు, మైనింగ్, రాయాల్టీ ట్యాక్సీలు ఇతర రాబడులు గ్రామ పంచాయతీలకు వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సర్పంచుల అందరికీ గౌరవ వేతనం 30 వేలు ఇవ్వాలని కోరారు. రేపు ఖమ్మం లో మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే జిల్లా సర్పంచుల చైతన్య సదస్సును జయప్రదం చేయాలని నరేందర్ విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జడ్పీటీసీల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు బెల్లం శ్రీనివాస్, ఎంపీపీ ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లోడిగా వెంకన్న యాదవ్ పాల్గొన్నారు.

### ప్రజా సంక్షేమమే ధ్యేయం
## చంద్రుగొండ పర్యటనలో పేర్కొన్న ఎమ్మెల్యే జారె.





**చంద్రుగొండ ఆగస్టు 23 మీ వార్త ఆర్ సి వనమాల శ్రీనివాసరావు:** చంద్రుగొండ మండల పరిధిలోని గుర్వాయిగూడెం, రావికంపాడు గ్రామాలలో అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ ఈరోజు విస్తృతంగా పర్యటించారు. గుర్వాయిగూడెం గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి కాబడి నిర్వహించిన గృహప్రవేశ మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం రావికంపాడు గ్రామంలో అత్యంత వైభవంగా నిర్వహించిన గ్రామ దేవతల బోనాల ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదే గ్రామానికి చెందిన పాయం మాధవి గారి నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు అందించారు. పర్యటనలో భాగంగా ఇటీవల హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్లో చికిత్స పొంది నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న రామిశెట్టి నరసింహస్వామిని, అలాగే చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్న షేక్ అమీర్ని వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు. అలాగే ఇటీవల కాంగ్రెస్ పార్టీ గ్రామ సేవాదళ్ అధ్యక్షులు రేఖం నరేష్ మాతృమూర్తి దివంగత రేఖాం కాంతమ్మ మృతి చెందిన సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన గాఢ సానుభూతిని తెలిపారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ప్రజల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు....

## వర్షాల కోసం రైతన్నల నిరీక్షణ.

- నిరాశాజనకంగా ఖరీఫ్ వ్యవసాయ సీజన్.
- నిండని చెరువులు- నాట్లు పడని మాగానీలు
వరి సాగు అంతంత మాత్రమే





కారేపల్లి ఆగస్టు 23 మీ వార్త ప్రతినిధి: ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతులు నిరాసాన్నిస్పృహలతో కొట్టుమిట్టాడు తున్నారు. ఖరీఫ్ సీజన్లో వరినాట్లు వేసే దశ అత్యంత కీలకం. ఏటా ప్రస్తుత సమయానికి మండలంలో జోరుగా దమ్ము, వరినాట్లు పనులు జరుగుతుంటాయి. ప్రతి సంవత్సరం మండలంలో సుమారు 14000 ఎకరాలకు పైగా వరి పంట సాగు చేస్తారు ఆగస్టు మొదటి వారంనాటికి దాదాపు సగం విస్తీర్ణంలో వరినాట్లు పూర్తవుతాయి. కాగా ప్రస్తుత సీజన్లో ఎల్నినో ప్రభావంతో గత రెండు నెలల్లో సాధారణ వర్షపాతంలో సగం కూడా కురవలేదు. ఇంతవరకు వరినాట్లు మండలంలో 2 శాతానికి కూడా మించలేదు. మండల వ్యాప్తంగా వరి సాగు అంతంత మాత్రం గాని కొనసాగుతుంది. సింగరేణి మండలంలో నెలకొన్ని తీవ్రవర్షాభావ పరిస్థితులు అన్నదాతలను.. ముఖ్యంగా వరి సాగు చేసే రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. జూన్, జూలై నెలల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడ వ్యవసాయ పనులు మందగించాయి. అడపాదడపా కురుస్తున్న జల్లులతో కొంతమంది రైతులు ఆకుమడులను సిద్ధం చేసుకొని వరి విత్తనాలు చల్లారు. అవి మొలకెత్తినప్పటికీ సరిపడ నీరు (వర్షం) లేకపోవడంతో ఎదుగుదల లేక మొక్కలు ఎండిపోతున్నాయి. మరోవైపు పొలాల్లో కనీసం దుక్కులు కూడా దున్నలేదు. మండలంలో జూన్ ఒకటినుంచి ఆగస్టు 23వ తేదీ వరకు సరైన వర్షపాతం నమోదు కాకపోవడం ప్రధాన చెరువులలో ఆశించిన స్థాయిలో వరద నీరు రాకపోవడంతో పాటు కేవలం కుంటలు వర్షపు నీరు తోనే వరి నాట్లు సాగుతున్నాయి. అయితే ఇటీవల మండల అధికారులు వరి సాగుకు సరిపడ నీరు రాకపోతే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. ఇదే క్రమంలో ప్రధాన చెరువులలో తూములు తీయవద్దని ఆదేశించినట్లు తెలుస్తుంది. ఈ వారాంతంలో వర్షాలు కురుస్తాయని ఆశాభావంతో వర్షాల కోసం మండల రైతులు నిరీక్షిస్తున్నారు.

## నైవేద్యాలతో ఉన్న బంజారా మహిళలు.

- భాగ్యనగర్ తండాలో తీజ్ పండుగ వేడుక.
- ప్రకృతి బంజారా సంస్కృతి సమ్మేళనమే తీజ్.
- భాగ్యనగర్ సర్పంచ్ బాణోత్ హీరాలాల్.



**కారేపల్లి ఆగస్టు: 23 మీ వార్త ప్రతినిధి:** ప్రకృతిని ఆరాధించడంతోపాటు ఎన్నో సంవత్సరాలుగా బంజారాల సంస్కృతి సమ్మేళనమే తీజ్ పండుగ వేడుక అని భాగ్యనగర్ సర్పంచ్ బాణోత్ హీరాలాల్ అన్నారు. సింగరేణి మండలం భాగ్యనగర్ తండాలో నిర్వహించిన తీజ్ నిమజ్జన కార్యక్రమంలో సర్పంచ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూబంజారా సంస్కృతిలో తీజ్ పండుగకు అత్యంత ప్రాధాన్యత ఉందని,ప్రకృతి తో పాటు అందరిని ఓకే చోట కలిపే మహోన్నత పండుగ తీజ్ అన్నారు. బంజారా(లంబాడా ) సమాజం అనాదిగా ప్రకృతిని ప్రేమిస్తూ, ప్రకృతితో మమేకమై,జీవిస్తున్న సమాజం అని,తమ జీవన విధానంలో,ప్రకృతి కి భూమి కి, పంటలకు,పశుసంపదకు విశేషస్థానం ఉందని, బంజారాల విశిష్ట పండగల్లో తీజ్ ఒకటని అన్నారు. గ్రామం లో గత తొమ్మిది రోజులుగా యువతులు అత్యంత భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించి , ఆదివారం నిమజ్జనం కోసం దేవుళ్ళకు నైవేద్యం సమర్పించిన అనంతరం డప్పు చప్పుళ్ళ తో బంజారా సంప్రదాయ నృత్యాలు చేశారు. తీజ్ నిమజ్జనం సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ జిల్లా నాయకులు గుగులోత్ భీముడు నాయక్, బానోత్ రాందాస్ నాయక్, లకావత్ దామ్లా,భగవాన్ దాస్, హాతీయ, బాబా, తోప్య,బానోత్ రాంచందర్, మంగీలాల్, లావుడ్యా ఈర్య,భూక్యా తారాచంద్, వీరన్న,గాంధీ, రాంబాబు,గోబ్రియ,బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## టేకులగూడెం పంచాయతీలో బోనాల సందడి






**కారేపల్లి ఆగస్టు 23 మీ వార్త ప్రతినిధి:** తెలంగాణ సంస్కృతిలో భాగంగా ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో బోనాల పండుగ సందర్భంగా టేకులగూడెం గ్రామపంచాయతీ లో బోనాల పండుగను పురస్కరించుకొని గ్రామ దేవతలైన ముత్యాలమ్మ తల్లికి అత్యంత భక్తి శ్రద్ధలతోమహిళలు బోనాలు ఆదివారం సమర్పించారు. మహిళలు వండిన అన్నం పాలు బెల్లంతో నైవేద్యాన్ని మట్టి కుండలు రాగి కుండలో వండి ముత్యాలమ్మ తల్లికి అత్యధిక సంఖ్యలో పాల్గొని నైవేద్యాన్ని సమర్పించారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చాక బోనాల పండుగను రాష్ట్ర పండుగ గా గుర్తించారని ఈ బోనాలు అత్యంత ప్రాచుర్యం పొందాయని అన్నారు బోనము అంటే భోజనము అనే పదానికి వికృతి రూపంమే బోనం అని అర్థం ఊరు పచ్చంగా ఉండాలని పాడిపంటలు పండాలని అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని గ్రామము అభివృద్ధిలో ఉండాలని కోరుకున్నారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుమ్మడి ఎర్రయ్య, ముత్తి రామారావు, గుగ్గిల రామారావు, దోమల నాగేశ్వరరావు, కోడం సీతారాములు, పాలకవర్గ సభ్యులు ఉప సర్పంచ్ బిక్కసాని భాస్కర్ రావు, దోమల సీత, కొడెం రమణ, గుమ్మడి నరసింహారావు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### బాల నరసింహస్వామిని
## దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు



**కారేపల్లి ఆగస్టు 23 మీ వార్త ప్రతినిధి:** కోదాడ మండలం ఎర్రవరం గ్రామంలో స్వయంభుగా వెలసిన బాలనరసింహ స్వామిని సింగరేణి మండలానికి చెందిన జిల్లా కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు రమాదేవి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. స్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఇమ్మడి తిరుపతిరావు మాట్లాడుతూ స్వయంభుగా వెలసిన శ్రీ బావనరసింహ స్వామిని దర్శించుకోవడం తమ అదృష్టంగా భావిస్తున్నామని, ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలు బాగుండాలని, వైరా నియోజకవర్గ ప్రజలు అందరూ ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో తులతూగాలని ఆ స్వామిని వేడుకున్నామన్నారు. స్వామిని దర్శించుకున్న వారిలో కాంగ్రెస్ నాయకులు తొగర శ్రీను, పాలిక వీరయ్యలు ఉన్నారు.

### ఉమ్మడి ఖమ్మం జిల్లా
## హ్యాండ్ బాల్ జనరల్ బాడీ సమావేశం.






**ఖమ్మం ఆగస్టు 23 మీ వార్త ప్రతినిధి:** ఉమ్మడి ఖమ్మం జిల్లా హ్యాండ్ బాల్ జనరల్ బాడీ సమావేశం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అశోక్ రెడ్డి మోహనరావు సమక్షంలో నిర్వహించటం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధి గా తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కారదర్శి మరియ హ్యాండ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రెటరీ ఐన శామ్యూల్ పవన్ కుమార్ హాజరవటం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో ఖమ్మం వేదికగా రాష్ట్ర స్థాయి పోటీలు నేషనల్ హ్యాండ్ బాల్ పోటీలను నిర్వహించాలని సూచించడంజరిగింది. ఇందుకు జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆమోదించటం జరిగింది. దీనికి కావాల్సిన ప్రణాళికను జిల్లా అధ్యక్ష ,కార్యదర్శిల సమక్షంలో చర్చించటం జరిగింది. ఈ సమావేశంలో అన్నిమండలాల, అధ్యక్షులు కార్యదర్శులు పాల్గొనటం జరిగింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ, సీనియర్ క్రీడాకారులు రాము, లక్ష్మయ్య ఆధ్వర్యంలో శామ్యూల్, పవనకుమార్ సన్మానించడం జరిగింది.

## ఊట్కూర్ లో దోమల నివారణకు ఫాగింగ్.



**కామేపల్లి ఆగస్టు 23 మీ వార్త ప్రతినిధి:** కామేపల్లి మండలం ఊట్కూరు గ్రామంలో ఆదివారం రాత్రి దోమల నివారణకు సర్పంచ్ ఈసం హనుమంతరావు, ఉప సర్పంచ్ కర్నాటి రాజేంద్రప్రసాద్ ల ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది ముమ్మరంగా ఫాగింగ్ నిర్వహించారు. వర్షాకాలం దృష్ట్యా దోమల బెడద నివారణకు, ప్రజారోగ్య పరిరక్షణ కొరకు వారు ఫాగింగ్ నిర్వహించా రు. ఈ సందర్భంగా సర్పంచ్ హనుమంతరావు, ఉప సర్పంచ్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామస్తులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది ఏపూరి ఉపేందర్, పోలేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే కోరం కనకయ్య, డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ను కలిసిన కాంగ్రెస్ నాయకులు.





**కామేపల్లి ఆగస్టు 23 మీ వార్త ప్రతినిధి:** ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ను కామేపల్లి, రామకృష్ణాపురం గ్రామ పంచాయతీలకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం పార్టీకి సంబంధించిన అంశాలపై వారు వారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దొడ్డిగర్ల సుందరం,రామకృష్ణాపురం గ్రామ శాఖ అధ్యక్షులు సూదనపు కోటయ్య, ఆయా పంచాయతీలకు చెందిన కాంగ్రెస్ నాయకులు అజ్మీర చిన్న నాయక్, మెట్టు రాము, ఇజ్జి బాబు, బాబు, సర్వయ్య, భూక్య సుమన్ నాయక్, కాళంగి చలమయ్య, తంగిళ్ళపల్లి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాప హరీశ్వరునికి ప్రత్యేక పూజలు



**బాసర :** బాసర ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ పాపహరేశ్వర ఆలయంలో ఆదివారం శ్రావణమాసం ఏకాదశి సందర్భంగా స్వామివారికి అర్చకులు నాగేష్ అప్ప ఆధ్వర్యంలో రుద్రాభిషేకం,అన్నపూజ, హర్చన,హారతి విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులందరికీ అన్న దానం నిర్వహించారు సోమ వారం రోజు శ్రీ పాప హరేశ్వర నూతన ఆలయ కమిటీ కార్యవ ర్గాన్ని ఎన్నుకుంటామని సర్పంచ్ తీగల వెంకటేష్ గౌడ్,విడిసి అధ్యక్షుడు లింగారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి కార్యక్రమా నికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలనీ కోరారు.

## సింగరేణిలో మారు పేర్ల సమస్యను వెంటనే పరిష్కరించాలి

**సింగరేణి యాజమాన్యానికి విశ్రాంత ఉద్యోగుల సంఘం**



**మంచిర్యాల :** సింగరేణి కంపెనీలో గత కొన్ని సంవత్సరాలుగా కార్మికులు ఎదుర్కొంటున్న మారు పేర్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, సింగరేణిలో అనేక సంవత్సరాలుగా విధులు నిర్వహించిన ఉద్యోగుల పేర్లలో ఉన్న మారు పేర్ల కారణంగా ఉద్యోగ సంబంధిత హక్కులు, వారసత్వం, కారుణ్య నియామకాలు, సర్వీస్ ప్రయోజనాలు, ఇతర సంక్షేమ పథకాల విషయంలో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఉద్యోగి నిరంతర సేవా రికార్డులు, సర్వీస్ వివరాలు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిగణనలోకి తీసుకొని మానవతా దృక్పథంతో మారు పేర్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న విజిలెన్స్ కేసులను కూడా త్వరితగతిన పరిష్కరించి బాధిత కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలని సింగరేణి సీఎండీ బి. ప్రకాష్ జ్యోతి, డైరెక్టర్లకు సమావేశం లో విజ్ఞప్తి చేశారు . ఈ సమావేశంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం, తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడు రాళ్లబండి రాజన్న, ప్రధాన కార్యదర్శి పుదారి నర్సయ్య, ఉపాధ్యక్షులు ఏ. గంగన్న, ఎన్. సదాశివ, బుర్ల జ్ఞాని, సలహాదారు ఎం. అంజయ్య, ఎం. సత్యనారాయణరావు, కార్యదర్శి కాటం లక్ష్మణ్, నాయకులు గుజ్జ చందు, గజెల్లి సుధాకర్, జి. సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం "సింగరేణి విశ్రాంత ఉద్యోగులారా ఏకం కండి" "సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం వర్ధిల్లాలి""సింగరేణి అమరవీరులకు జోహార్లు", "జై సింగరేణి", "జై తెలంగాణ" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

# కామేపల్లి లో ఘనంగా శ్రావణమాసం బోనాలు.

- ముత్యాలమ్మ తల్లి, బొడ్రాయికి పూజలు.
- బోనాలు సమర్పించిన మహిళలు.
- బోనం ఎత్తి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన చిన్నారి.
- ముత్యాలమ్మ తల్లి గుడి వద్ద భక్తుల సందడి.







**కామేపల్లి ఆగస్టు 23 మీ వార్త ప్రతినిధి:** మండల కేంద్రమైన కామేపల్లి లో శ్రావణమాసం సందర్భంగా ఆదివారం మహిళలు బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. తలపై బోనాలు ఎత్తుకొని గ్రామ పురవీధుల్లో మేళ్ల తాళాలు డప్పు వాయిద్యాలతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి కి పూజలు,జలాభిషేకం నిర్వహించారు. ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. వర్షాలు పుష్కలంగా కురవాలని, సమృద్ధిగా పంటలు పండాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని,అందరినీ చల్లగా చూడాలని కోరుతూ మహిళలు వేడుకున్నారు. మొక్కులు కూడా చెల్లించుకున్నారు. దీంతో ముత్యాలమ్మ గుడి వద్ద భక్తుల సందడి నెలకొంది. ఓ చిన్నారి కూడా బోనమెత్తి వేడుకలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బోనాల వేడుకలతో కామేపల్లి లో పండుగ వాతావరణం తో పాటు ఆధ్యాత్మిక వాతావరణం, కోలాహలం నెలకొంది. గత ఏడాది కంటే ఈ ఏడాది ఘనంగా బోనాల పండుగ జరుపుకున్నారు. ముత్యాలమ్మ తల్లి కి బోనాలు సమర్పించిన కొద్దిసేపటికి వర్షం కురవడంతో భక్తులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. అదే విధంగా మండల పరిధిలోని పాత లింగాల, జాస్తిపల్లి, ముచ్చర్ల, గరిడేపల్లి తదితర గ్రామాల్లో కూడా శ్రావణమాసం బోనాల పండుగను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ వేడుకలలో మాజీ ఎంపీటీసీ రామ్ రెడ్డి జగన్నాథ్ రెడ్డి, సర్పంచ్ కిన్నెర సుజాత, మాజీ సర్పంచ్ కిన్నెర నాగయ్య, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు, మహిళలు, యువజనులు, రైతులు, గుడిమెట్ల శేఖర్, గరిడేపల్లి సర్పంచ్ ధరావత్ కంసేలి, ధరావత్ ప్రసాద్, గుగులోతు గోపి తదితరులు పాల్గొన్నారు.

# జాస్తిపల్లి లో వైభవంగా ముత్యాలమ్మ తల్లి కి బోనాలు.

- బోనాలతో మహిళలు భారీ ప్రదర్శన.
- అమ్మవారికి బోనాలు సమర్పణ.
- ముత్యాలమ్మ తల్లి గుడి వద్ద భక్తుల సందడి.
- బోనాల వేడుకల్లో ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు.





**కామేపల్లి ఆగస్టు 23 మీ వార్త ప్రతినిధి:** కామేపల్లి మండలం జాస్తి పల్లి గ్రామం లో ఆదివారం ముత్యాలమ్మ తల్లి కి మహిళలు శ్రావణమాసం సందర్భంగా బోనాలు సమర్పించారు. గ్రామం లోని మహిళలు తలపై బోనాలు ఎత్తుకొని మేళ్ల తాళాలు డప్పు వాయిద్యాలతో గ్రామ పురవీధుల్లో భారీ ప్రదర్శన నిర్వహించారు. గ్రామ దేవత అయిన బొడ్రాయికి పూజ లు సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్దకు వచ్చి మహిళలు, గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, గ్రామ పెద్దలు, యువజనులు,భక్తులు పూజలు, జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని అందుకుగాను చల్లగా చూడాలని ముత్యాలమ్మ తల్లి కి మొక్కుకున్నారు. బోనాలు సమర్పించారు. మొక్కులు కూడా చెల్లించారు. గ్రామస్తులతో పాటు వారి బంధువులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ముత్యాలమ్మ తల్లి ఆలయం కిటకిటలాడింది. దీంతో భక్తుల సందడి నెలకొంది. గత ఏడాది కంటే ఈ ఏడాది రెట్టింపు దశలో శ్రావణ మాస బోనాలు నిర్వహించారు. దీంతో గ్రామంలో కోలాహలంతో పాటు ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. పండుగ వాతావరణం లో సాంప్రదాయ బద్ధంగా నిర్వహించిన ఈ బోనాల ఉత్సవ కార్యక్రమంలో సర్పంచ్ ధరావత్ నాగమణి, ఉప సర్పంచ్ దేవేండ్ల శైలజ, గ్రామ పెద్దలు మల్లెంపాటి శ్రీనివాసరావు, తోటకూరి శివయ్య, మాజీ ఎంపిటిసి మల్లెంపాటి నరసింహారావు, మాజీ ఉపసర్పంచ్ బత్తుల పుల్లయ్య, వేముల వెంకటనారాయణ, వరికొల్లు వీరబాబు, నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ బత్తుల రాంబాబు, చల్లా శ్రీరాములు, దేవేండ్ల కృష్ణయ్య, మేక నాగయ్య, మేక అశోక్, దేవేండ్ల నాగేశ్వరరావు, రాయల సత్యనారాయణ, రాయల భాస్కరరావు, రాయల శ్రీను, చల్లా లక్ష్మయ్య, బత్తుల మల్లయ్య, దేవుండ్ల కొండ, ఎర్రబోయిన కృష్ణయ్య, తమ్మిశెట్టి సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సీపీఐ యువజన ఉద్యమానికి చిమ్మపూడి చిన్నోడు సారథి.

- ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా చింతల రమేష్.
- అపారమైన నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సీపీఐ నాయకత్వానికి కృతజ్ఞతలు చింతల రమేష్.



**రఘునాథపాలెం ఆగస్టు 23 మీ వార్త ప్రతినిధి:** రఘునాథపాలెం మండలం చిమ్మపూడి గ్రామానికి చెందిన చింతల రమేష్ సీపీఐ అనుబంధ యువజన విభాగమైన అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఆగస్టు 21న చింతకాని మండలం కొదుమూరు గ్రామంలో నిర్వహించిన ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా 25వ మహాసభలో రమేష్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, జిల్లా ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యమ కుటుంబం నుంచి యువజన నాయకత్వం వరకు చిమ్మపూడి గ్రామానికి చెందిన చింతల వెంకన్న, చిట్టెమ్మ దంపతుల రెండో సంతానమైన చింతల రమేష్ చిన్నతనం నుంచే ఉద్యమ భావజాలంతో పెరిగారు. తండ్రి చింతల వెంకన్న సీపీఐ కార్యకర్తగా అందించిన ప్రోత్సాహంతో పాటు సీపీఐ నేత రజబ్ అలీ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై స్పందించే తత్వాన్ని అలవర్చుకున్నారు. విద్యార్థి దశలోనే సామాజిక సమస్యలు, విద్యార్థుల హక్కుల పట్ల ఆకర్షితుడై ఉద్యమ బాట పట్టారు. 2008లో ప్రారంభమైన ఉద్యమ ప్రస్థానం 2008లో ఎస్ ఎఫ్ ఐ విద్యార్థి ఉద్యమంలోకి అడుగుపెట్టిన రమేష్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. 16 సంవత్సరాల పాటు విద్యార్థి, యువజన, ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తూ జిల్లా, రాష్ట్రస్థాయిలో యువనేతగా గుర్తింపు పొందారు. ఈ ఉద్యమ ప్రస్థానంలో అనేక నిర్బంధాలు, కేసులు, ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. సుమారు 20 కేసులు నమోదై, 40 రోజుల పాటు జైలు జీవితం గడిపినప్పటికీ ఉద్యమ పంథాను వీడకుండా ప్రజా సమస్యలపై పోరాటాన్ని కొనసాగించారు. చదువుతో పాటు ఉద్యమంలోనూ రాణింపు రమేష్ ఉద్యమాలతో పాటు విద్యలోనూ రాణించారు. చిమ్మపూడిలో పదో తరగతి పూర్తి చేసిన ఆయన ఖమ్మంలోని శారద కాలేజీలో ఇంటర్మీడియట్, ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం కాకతీయ యూనివర్సిటీలో పోస్టుగ్రాడ్యుయేషన్, అనీబిసెంట్ కాలేజీలో బీఈడీ పూర్తి చేశారు. విద్యను కొనసాగిస్తూనే ఉద్యమ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ విద్యార్థి, యువజన సమస్యలపై తనదైన ముద్ర వేశారు. ఏఐవైఎఫ్‌లో కొత్త అధ్యాయం కొంతకాలం అనంతరం కొన్ని అనివార్య కారణాల వల్ల సీపీఎం పూర్తి కాల కార్యకర్తగా, డీవైఎఫ్ఐ ఉద్యమ బాధ్యతలకు రాజీనామా చేసిన రమేష్ తన మాతృ సంస్థ సీపీఐ అనుబంధ ఏఐవైఎఫ్‌లో 2025లో చేరారు. అనంతరం ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లో మండల కమిటీల నిర్మాణానికి కృషి చేస్తూ ఏఐవైఎఫ్ ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషించారు. తక్కువ కాలంలోనే సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించి యువతను ఉద్యమం వైపు ఆకర్షించడంలో ఆయన కృషి గుర్తింపు పొందింది. యువత కోసం బలమైన ఉద్యమం నిర్మిస్తా చింతల రమేష్ కార్యదర్శి జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం చింతల రమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తానని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో విఫలమవుతున్నాయని, యువతకు తగిన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని రమేష్ విమర్శించారు. నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు, విద్య, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భవిష్యత్‌లో మరింత బలమైన పోరాటాలు చేపడతామని తెలిపారు. యువత పెడదారి పట్టకుండా సామాజిక బాధ్యత, ప్రజా సమస్యలు, హక్కులపై చైతన్యం కల్పిస్తూ ఖమ్మం జిల్లాలో బలమైన యువజన ఉద్యమాన్ని నిర్మించడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

## టైగర్ జోన్ రద్దు చేయాలి-ఏకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలి

**రిలే నిరాహారదీక్ష చేపట్టిన భూమాచారి**



**జన్నారం :** జన్నారం డివిజన్ లోని కవ్వాల్ టైగర్ జోన్ రద్దు చేయాలని, ఏకో సెన్సిటివ్ జోన్ ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ సామాజిక పోరాట సమితి మండల అధ్యక్షుడు శ్రీరా ముల భూమాచారి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ రిలే నిరాహారదీక్ష కు మండల వర్తక వ్యాపారులు, పలు పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు, కుల సంఘాలు, పలువురు సర్పంచులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా భూమాచారి మాట్లాడుతూ కవ్వాల్ టైగర్ జోన్ ఆంక్షలు ఎత్తివేయడం కాదు పూర్తిగా కవ్వాల్ టైగర్ జోన్ ను ఎత్తివేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలని, ఎకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. టైగర్ జోన్ పేరుతో జన్నారం రేంజిలో సస్పెండ్ చేసిన అటవీ శాఖ ఉద్యోగులను విధుల్లో చేర్చుకొని సర్వీసులో ఎలాంటి మరకలు లేకుండా పూర్తి జీతం చెల్లించాలని కోరారు.

## బిజినెస్

### రూ.2 లక్షల జీతం.. అయినా కష్టాలే!



సాధారణంగా నెలకు రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల జీతం అంటే చాలామందికి మంచి ఆదాయమే. ఇలాంటి జీతం వస్తే హాయిగా జీవించొచ్చని అనుకుంటారు. కానీ.. పెద్ద నగరాల్లో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంటుందని ఓ మహిళ చెబుతోంది. నెలకు రూ.1-2 లక్షలు సంపాదిస్తున్నా.. ఖర్చులు పోగా చేతిలో పెద్దగా డబ్బు మిగలడం లేదని పేర్కొంది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

**ఏమిటీ 'శాలరీ ట్రాప్'**

ఇన్‌స్టాగ్రామ్‌లో నిధి కుష్వాహ్ అనే మహిళ ఈ విషయంపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. టైర్-1 నగరాల్లో నెలకు రూ.1-2 లక్షలు సంపాదించే వాళ్లు కూడా ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని వివరించారు. ఆమె చెప్పిన లాజిక్ కూడా చాలామందికి కనెక్ట్ అవుతోంది. ఈ జీతం తక్కువ ఆదాయంతో జీవించే స్థాయి నుంచి బయటపడటానికి సరిపోతుంది. కానీ.. ఖరీదైన జీవనశైలిని ఎలాంటి ఆలోచన లేకుండా కొనసాగించడానికి మాత్రం సరిపోదు. అంటే.. జీతం బాగానే ఉంటుంది, కానీ నెలాఖరుకు బ్యాంక్ బ్యాలెన్స్ చూస్తే మాత్రం నిరాశే మిగులుతుంది.

**పెద్ద నగరాల్లో ఖర్చులు**

ఇక్కడ ప్రధాన సమస్య జీవన వ్యయం. టైర్-1 నగరాల్లో ఇంటి అద్దె ఒక్కటే జీతంలో పెద్ద భాగాన్ని తీసుకుపోతుంది. దానికి తోడు కరెంట్, ఇంటి ఖర్చులు, కారు లేదా బైక్ ఈఎంఐ, పెట్రోల్, పిల్లల స్కూల్ ఫీజులు, వైద్యం, బయట తినడం, షాపింగ్ ఇలా ఒక్కో ఖర్చు కలుస్తూ పోతుంది. ఉదాహరణకు నెలకు రూ.1.5 లక్షలు జీతం వస్తే.. అందులో రూ.30-40 వేలు ఇంటి అద్దెకే వెళ్లొచ్చు. పిల్లలున్న కుటుంబాల్లో స్కూల్ ఫీజులు, వైద్య ఖర్చులు అదనంగా ఉంటాయి. కారు ఈఎంఐ లేదా హోమ్ లోన్ ఉంటే మరో పెద్ద మొత్తం అక్కడే పోతుంది. చివరికి పొదుపు చేయడానికి అనుకున్న డబ్బు చాలా తక్కువగా మిగలొచ్చు.

**జీతం పెరిగితే ఖర్చులు కూడా**

ఇక్కడ మరో ఆసక్తికరమైన విషయం లైఫ్‌స్టైల్ ఇన్‌ఫ్లేషన్. జీతం పెరిగినప్పుడు మన అవసరాలు మాత్రమే కాదు.. మన కోరికలు కూడా పెరుగుతాయి. మంచి జీతం రావడంతో ఖరీదైన ఇల్లు, కొత్త కారు, ఎక్కువ ట్రావెల్స్, రెస్టారెంట్లు, బ్రాండెడ్ వస్తువులు ఇలా ఖర్చులు పెరగొచ్చు. మొదట్లో ఇవన్నీ చిన్న ఖర్చుల్లానే అనిపిస్తాయి. కానీ నెలాఖరుకు చూస్తే మొత్తం పెద్దదైపోతుంది. అందుకే కొంతమందికి జీతం రూ.80 వేల నుంచి రూ.1.5 లక్షలకు పెరిగినా.. పొదుపు మాత్రం పెద్దగా పెరగదు.

**ఇతరులతో పోల్చుకోవడం మరో సమస్య**

సోషల్ మీడియా వల్ల ఈ సమస్య మరింత పెరుగుతోందని కొందరు అభిప్రాయపడుతున్నారు. మన చుట్టూ ఉన్నవాళ్లు కొత్త కారు కొంటున్నారు, విదేశాలకు వెళ్తున్నారు, ఖరీదైన రెస్టారెంట్లకు వెళ్తున్నారు అని చూసి మనం కూడా అదే స్థాయిలో జీవించాలనుకుంటాం. కానీ వాళ్ల ఆదాయం ఎంత?, వాళ్ల అప్పులు ఎంత?, వాళ్లు ఎంత పొదుపు చేస్తున్నారు?, అనేది మనకు తెలియదు. అయినా వాళ్ల జీవనశైలిని చూసి మన ఆర్థిక పరిస్థితికి సరిపోని ఖర్చులు చేస్తే సమస్యలు మొదలవుతాయి.

**నెటిజన్ల స్పందన**

నిధి కుష్వాహ్ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో భిన్నమైన స్పందనలు వచ్చాయి. కొందరు ఆమె చెప్పింది నిజమేనని అన్నారు. తమ స్నేహితులు కూడా ఇలాంటి ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని కొందరు చెప్పారు. అయితే.. మరికొందరు మాత్రం సమస్య జీతంలో కంటే మన ఖర్చు చేసే విధానంలో ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. మనకు

# వైద్య వ్యాపారం భళా..

## విస్తరణ బాటలో ప్రముఖ దవాఖానలు.. ఆంత్రప్రెన్యూర్లుగా డాక్టర్ల దూకుడు

## ప్రైవేట్ ఈక్విటీలు, పబ్లిక్ మార్కెట్ల నుంచి నిధుల సమీకరణ

## రుణ భారం తగ్గించుకుంటూనే ఆధునికీకరణ దిశగా అడుగులు

## ఆస్పత్రుల కొనుగోళ్లు, విలీనాలతో నెట్‌వర్క్ పెంచుకుంటున్న బడా గ్రూపులు

**న్యూఢిల్లీ :** కూడు.. గూడు.. గుడ్డ.. ఆ తర్వాత ఈ దేశంలోని కోట్లాది ప్రజల కల ఆరోగ్య సంరక్షణే. ఇదే.. ఇప్పుడు భారతీయ వైద్య రంగాన్ని వేగంగా వృద్ధిపథంలో నడిపిస్తున్నది. ఇక ఆపత్కాలంలో వైద్యం చేయడమే కాదు.. అవసరమైతే ఆంత్రప్రెన్యూర్లుగానూ మారుతామని డాక్టర్లు నిరూపిస్తున్నారు. దీంతో హెల్త్‌కేర్ బిజినెస్ దూసుకుపోతున్నది. అందరికీ ఆరోగ్య బీమా అందుబాటులోకి రావడం కూడా.. ప్రైవేట్ ఆస్పత్రుల విస్తరణకు దోహదం చేస్తున్నది. దేశంలో 60 కోట్లకుపైగా జనాభాకు ఆరోగ్య బీమా ఉన్నట్టు అంచనా. హెల్త్ చెకప్ ప్యాకేజీలను బుక్ చేయడం ఇదీ సంగతి..



మణిపాల్, అపోలో దగ్గర్నుంచి మ్యాక్స్ హెల్త్‌కేర్, ఫోర్టిస్ హెల్త్‌కేర్, మేదాంత, పరాస్ హెల్త్, యశోదా హాస్పిటల్స్ వరకు దేశంలోని అన్ని ప్రధాన దవాఖానల గ్రూపులు.. పడకలను పెంచుకుంటూ, కొత్త మార్కెట్లలోకి ప్రవేశిస్తూపోతున్నాయి. ఈ క్రమంలోనే దేశ, విదేశీ పెట్టుబడిదారులను ఆకర్షించడమేగాక, స్టాక్ మార్కెట్ల నుంచీ ఇనిషియల్ పబ్లిక్ ఆఫర్ల (ఐపీవో) ద్వారా పెద్ద ఎత్తున నిధులను సమీకరిస్తున్నాయి. పడకల సామర్థ్యం ప్రకారం దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ హాస్పిటల్ నెట్‌వర్క్ అయిన మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్.. జూలైలో రూ.9,275 కోట్ల ఐపీవోను తెచ్చింది. దేశ, విదేశాల్లో దవాఖానల కొనుగోలుకు చేసిన అప్పులను తీర్చేందుకు ఈ నిధులను వినియోగిస్తామని మణిపాల్ చెప్తున్నది. అలాగే అపోలో హాస్పిటల్స్ వచ్చే ఐదేండ్లలో దాదాపు 4,400 బెడ్లను పెంచుకోవాలని చూస్తున్నది. మరోవైపు ఢిల్లీ, ముంబై, గువాహటి, వారణాసి నగరాల్లో విస్తరించి, 2,950 బెడ్లను పెంచుకోవాలని మేదాంత యోచిస్తున్నది. ఇదే క్రమంలో వచ్చే 3-4 ఏండ్లలో గురుగ్రామ్, లక్నో, ఢిల్లీ, పంజాబ్, భువనేశ్వర్ ప్రాజెక్టుల ద్వారా మ్యాక్స్ హెల్త్‌కేర్ తమ పడకల సామర్థ్యాన్ని 10వేలకుపైగా పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నది. ఇక గ్రేటర్ నోయిడాలోని యశోదా మెడిసిటీలో యశోదా గ్రూప్ రూ.2,400 కోట్లను పెట్టుబడిగా పెడుతున్నది. ఫోర్టిస్, పారస్.. ఇలా అనేక ప్రముఖ గ్రూపులు దేశవ్యాప్తంగా విస్తరించాలని ప్రణాళికల్ని రచిస్తున్నాయి. పారిశ్రామిక పరికరాలను అద్దెకు తీసుకోవడం

**ఆంత్రప్రెన్యూర్లుగా..**

భారతీయ హాస్పిటల్ బూమ్ కేవలం పెట్టుబడుల ద్వారానే రాలేదు. దీని వెనుక దేశంలోని అతిపెద్ద హెల్త్‌కేర్ ఇనిస్టిట్యూషన్ల పెద్దలున్నారు. డాక్టర్లుగా తమ ప్రయాణాన్ని మొదలుపెట్టి.. ఇప్పుడు విజయవంతమైన దవాఖానల నిర్వాహకులుగా పేరుగాంచారు. డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి (అపోలో హాస్పిటల్స్), డాక్టర్ నరేశ్ ట్రెహాన్ (మేదాంత), డాక్టర్ దేవీ శెట్టి (నారాయణ హెల్త్).. ఇలా ఎందరో ఉన్నారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తూ దూసుకెళ్తున్నారు. ఈ వరుసలో హైదరాబాద్ ఆధారిత, రెండు తెలుగు రాష్ర్టాలకు చెందినవారు ఒక అడుగు ముందే ఉన్నారంటే అతిశయోక్తి కాదు. దేశంలోని ఫార్మా కంపెనీల్లో ఎక్కువగా ఇక్కడే ఉండటం కూడా కలిసొస్తున్న అంశంగా ఇండస్ట్రీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. హాస్పిటల్స్ విస్తరణతో వైద్యులు, నర్సింగ్, ల్యాబ్ టెక్నీషియన్లు ఇతరత్రా మెడికల్ సిబ్బందికి ఉద్యోగావకాశాలూ పెరుగుతున్నాయని అంటున్నాయి.

2021-22 నుంచి ఇప్పటిదాకా ప్రైవేట్ ఈక్విటీలు, పబ్లిక్ మార్కెట్ల ద్వారా వివిధ ఆస్పత్రులు రూ.55,000-60,000 కోట్ల నిధులను సమీకరించినట్టు కేర్ రేటింగ్స్ అంచనా.

2030నాటికి అదనంగా మరో 38,000కుపైగా పడకల సామర్థ్యాన్ని పెంచుకోవాలని చూస్తున్న ప్రధాన హాస్పిటల్ గ్రూపులు. ఇందుకు రూ.40,000 కోట్ల పెట్టుబడులు పెట్టే అవకాశం.

యశోదా హాస్పిటల్స్ ఐపీవోకు సెబీ నుంచి గ్రీన్‌సిగ్నల్. ఫ్రెష్ ఇష్యూ, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.3,000-4,000 కోట్ల నిధుల సమీకరణే లక్ష్యంగా రావచ్చన్న అంచనాలు.

తెలుగు రాష్ర్టాలకు చెందిన అపోలో, యశోదా, కిమ్స్, కేర్, కామినేని, ఏఐజీ, రెయిన్‌బో హాస్పిటల్స్ గ్రూపులు.. దేశవ్యాప్తంగా, తొలుత దక్షిణాది రాష్ర్టాల్లో విస్తరణ దిశగా అడుగులు.

గడిచిన ఐదేండ్లలో తమ నెట్‌వర్క్‌లోకి 31 చిన్న ఆస్పత్రులను చేర్చుకున్న మణిపాల్ హెల్త్. అపోలో, కిమ్స్ తదితర సంస్థలూ ఇతర ఆస్పత్రులను హస్తగతం చేసుకోవడం, భాగస్వామ్యంగా చేర్చుకోవడం చేస్తున్నాయి. హెల్త్ చెకప్ ప్యాకేజీలను బుక్ చేయడం

టై-అప్‌ల ద్వారా కొత్త ప్రాంతాల్లోకి, నూతన వైద్య సేవల్లోకి వెళ్తున్న బడా కార్పొరేట్ ఆస్పత్రులు. సంయుక్తంగా దవాఖానలను నిర్వహిస్తూ లాభాల్లోకి.

2010లో రూ.12,546గా ఉన్న ప్రైవేట్ దవాఖానల సగటు ఇన్-పేషెంట్ ఖర్చు.. 2023లో రూ.42,600కు చేరిందని చెప్తున్న ఎన్ఎస్ఎస్‌వో గణాంకాలు.

దేశంలోని మెట్రో నగరాలు, ప్రధాన నగరాలకే పరిమితం కాకుండా.. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో విస్తరణపట్ల కూడా ఆసక్తి చూపుతున్న బడా హాస్పిటల్ గ్రూపులు.

## చరిత్ర సృష్టించిన టీమిండియా బ్యాటర్..

# ప్రపంచంలోనే రెండో ప్లేయర్‌గా

చేతేశ్వర్ పుజారా రిటైర్మెంట్ తర్వాత టెస్టుల్లో భారత జట్టుకు మూడో స్థానం పెద్ద సమస్యగా మారిన సంగతి తెలిసిందే. సాయిసుదర్శన్, కరుణ్ నాయర్ వంటి ఆటగాళ్లను ప్రయోగించినప్పటికి పుజారా స్థానాన్ని భర్తీ చేయలేకపోయాడు. అయితే ఎట్టకేలకు పుజారా వారసుడు దొరికాడు. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి అద్భుతాలు చేస్తున్నాడు. అతడే కర్ణాటక స్టార్ బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కల్. దాదాపు మూడేళ్ల తర్వాత భారత టెస్టు జట్టులోకి ఎంట్రీ ఇచ్చిన పడిక్కల్ శతకాల మోత మోగిస్తున్నాడు. గాలే వేదికగా జరిగిన తొలి టెస్టులో సెంచరీతో సత్తాచాటిన పడిక్కల్.. ఇప్పుడు కొలంబోలో కూడా అద్భుత శతకంతో కదం తొక్కాడు. 193 బంతుల్లో 12 ఫోర్లతో 117 పరుగులు చేశాడు. ఈ క్రమంలో పడిక్కల్ పలు అరుదైన రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ చరిత్రలో ఒకే సిరీస్‌లో మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి ఒకటి కంటే ఎక్కువ సెంచరీలు చేసిన రెండో బ్యాటర్‌గా పడిక్కల్ నిలిచాడు. ఇంతకుమందు ఇంగ్లండ్ కెప్టెన్ జో రూట్ మాత్రమే ఈ ఘనత సాధించాడు. ఇప్పుడు రూట్ సరసన పడిక్కల్ చేరాడు. అంతేకాకుండా విదేశీ గడ్డపై భారత జట్టు తరపున మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి వరుసగా సెంచరీలు చేయడం 2019 తర్వాత ఇదే తొలిసారి. చివరగా 2018-19 బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో పుజారా వరుసగా




రెండు సెంచరీలు చేశాడు. మళ్లీ ఇప్పుడు ఏడేళ్ల తర్వాత ఈ ఫీట్‌ను దేవ్‌దత్ నమోదు చేశాడు.

## ఈస్ట్ బెంగాల్‌దే డ్యూరండ్ కప్..

## 22 ఏండ్ల తర్వాత ట్రోఫీ సొంతం

**కోల్‌కతా :** ప్రతిష్టాత్మక డ్యూరండ్ కప్‌లో ఈస్ట్ బెంగాల్ రెండు దశాబ్దాల తర్వాత ట్రోఫీ గెలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్‌లో ఆ జట్టు.. 4-1తో తమ చిరకాల ప్రత్యర్థి మోహన్ బగాన్ సూపర్ జెయింట్స్‌ను ఓడించి 22 ఏండ్ల తర్వాత మళ్లీ డ్యూరండ్ కప్‌ను కైవసం చేసుకుంది. ఫైనల్‌లో ఆ జట్టు తరఫున ఎడ్మండ్ లాల్రిండికా (12వ, 22వ, 44వ నిమిషాల్లో) హ్యాట్రిక్ గోల్స్ కొట్టగా బిపిన్ (10వ) ఒక గోల్ చేశాడు. 2004లో బెంగాల్.. 2-1తో మోహన్ బగాన్‌ను ఓడించి టైటిల్ గెలిచిన అనంతరం మళ్లీ ఆ జట్టు ఈ ట్రోఫీని నెగ్గడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ ట్రోఫీతో డ్యూరండ్ కప్‌ను అత్యధిక సార్లు గెలుచుకున్న జట్టుగా ఈస్ట్‌బెంగాల్.. మోహన్ బగాన్(17)తో సమానంగా నిలిచింది.




## స్పోర్ట్స్

### 9వ స్థానంలో బ్యాటింగ్.. కట్ చేస్తే!

### 5ఫోర్లు, 5 సిక్సర్లతో విధ్వంసం



బెంగళూరు వేదికగా వెస్ట్ జోన్‌తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో నార్త్ జోన్ ఫాస్ట్ బౌలర్, చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ అన్షుల్ కాంబోజ్ బ్యాట్‌తో విరుచుకుపడ్డాడు. తొలి ఇన్నింగ్స్‌లో నార్త్‌జోన్ 165 పరుగులే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన కాంబోజ్ ప్రత్యర్ధి బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. వన్డే ఫార్మాట్‌ను తలపిస్తూ కేవలం 52 బంతుల్లోనే 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 60 పరుగులు చేశాడు. తొమ్మిది బ్యాటింగ్‌కు వచ్చిన కాంబోజ్ ఈ తరహా విధ్వంసం సృష్టిస్తాడని వెస్ట్ జోన్ బౌలర్లు అస్సలు ఊహించి ఉండరు. తుషార్ దేశ్‌పాండే, తనుష్ కొటియాన్ వంటి స్టార్ బౌలర్లను సైతం అన్షుల్ వదల్లేదు. ఫలితంగా నార్త్ జోన్ తమ మొదటి ఇన్నింగ్స్‌లో 251 పరుగులకు ఆలౌటైంది. నార్త్‌జోన్ బ్యాటర్లలో కాంబోజ్‌తో పాటు అయూశ్ బదోని(51),ఆయుష్ దోసేజా(42) రాణించారు. మిగితా బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు. వెస్ట్ జోన్ బౌలర్లలో తనీష్ కోటియన్, దేశ్‌పాండే తలా నాలుగు వికెట్లు సాధించారు. ఇక బ్యాటింగ్‌లో సత్తాచాటిన అన్షుల్.. బౌలింగ్‌లో ఎలా రాణిస్తాడో చూడాలి. మొదటి రోజు ఆటలో అతడికి బౌలింగ్ చేసే అవకాశం రాలేదు.

# మధుబాలగా మారేందుకు?

బాలీవుడ్ లెజెండరీ హీరోయిన్ మధుబాల బయోపిక్‌ను అగ్ర దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ ప్రకటించిన నాటినుంచీ.. మధుబాలగా మెప్పించే హీరోయిన్ ఎవరు? అనే ప్రశ్న బాలీవుడ్‌లో బలంగా వినిపిస్తున్నది. ఈ పాత్రలో ఫలానా హీరోయిన్ నటించనున్నదంటూ పలు హీరోయిన్ల పేర్లు కూడా వినిపించాయి. అయితే.. చివరకు మధుబాల పాత్రకు 'దురంధర్' బ్యూటీ సారా అర్జున్‌ని ఎంపిక చేసినట్టు సమాచారం. నటన, హావభావాలు, డ్యాన్స్ మూమెంట్స్, శరీరక భాష.. ఇలా అన్ని విషయాల్లోనూ మధుబాలను తలపించేందుకు సారా కఠినంగా శ్రమిస్తున్నట్టు బాలీవుడ్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఈ పాత్ర కోసం ఆమె ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకుంటున్నదట. సంజయ్‌లీలా భన్సాలీ సినిమాలు ఎంత గ్రాండియర్‌గా ఉంటాయో తెలిసిందే. ఈ చిత్రాన్ని ఆయన నిర్మిస్తుండగా, జస్మీత్ కె.రీన్ దర్శకత్వం వహిస్తున్నారు.






# ఇంటర్వెల్ బ్యాంగ్ భాగ్యనగరంలో?

'రాకా' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్. తన గత చిత్రాలకు భిన్నంగా, వైవిధ్యమైన కథ, కథనాలతో అత్యంత భారీగా దర్శకుడు అట్లీ రూపొందిస్తున్న ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలే ఉన్నాయి. మాఫియా నేపథ్యంలో ఓ డాన్ చుట్టూ ఈ సినిమా కథ నడుస్తుందని సమాచారం. సైన్స్ ఫిక్షన్ అంశాలు కూడా ఈ కథలో ఉన్నట్టు వినికిడి. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ముంబైలో జరుగుతున్నది. ఈ షెడ్యూల్ అనంతరం హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో మరో షెడ్యూల్‌ని దర్శకుడు అట్లీ ప్లాన్ చేశారు. దీనికోసం ఓ భారీ సెట్‌ని కూడా నిర్మిస్తున్నారు. ఈ సెట్‌లోనే ఇంటర్వెల్ బ్యాంగ్‌ని చిత్రీకరిస్తారట. అలాగే, కొన్ని యాక్షన్ సన్నివేశాలను కూడా తీస్తారని తెలిసింది. దీపిక పదుకోన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో మృణాళ్‌ఠాకూర్, జాన్వీ కపూర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సన్ పిక్చర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ పాన్‌ఇండియా సినిమాను నిర్మిస్తున్నది.



# స్వరాన్వేషణలో... 50 భాషల్లో 'వారణాసి' విడుదల

తెరపై కనిపించే తారలు వేరు... వాళ్లు పలికే సంభాషణలు పలికేవాళ్లు వేరు. మరి... తెరపై కనిపించే వ్యక్తి హావభావాలకు తగ్గట్టుగా సంభాషణలు పలికే వ్యక్తి కంఠస్వరం ఉండాలి కదా. ప్రస్తుతం రాజమౌళి అలా మ్యాచ్ అయ్యే 'వాయిస్'ల కోసం అన్వేషిస్తున్నారని సమాచారం. మహేశ్‌బాబు హీరోగా తాను తెరకెక్కిస్తున్న 'వారణాసి' కోసమే రాజమౌళి దాదాపు పదిహేను వందల మంది వాయిస్ ఆర్టిస్ట్‌లను పరిశీలించి, మ్యాచ్ అయ్యేవారితో డబ్బింగ్ చెప్పించాలని అనుకుంటున్నారట. ఇంతకీ 1500 మంది ఆర్టిస్ట్‌లు ఎందుకు అంటే... 'వారణాసి'ని ప్రపంచవ్యాప్తంగా 50 భాషల్లో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారని టాక్. అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని మిగతా భాషల్లోనూ అనువదించి, విడుదల చేస్తారు. సో... పాత్రలకు సరిగ్గా సరి పోయే గొంతులను ఎంపిక చేసి, ఆయా భాషల్లో డబ్బింగ్ చెప్పించాలనుకుంటున్నారట. ఇన్ని వాయిస్‌లంటే ఏఐ ద్వారా కూడా చేయొచ్చు. కానీ, భావోద్వేగాలు సహజంగా ఉండాలంటే మనుషులతోనే మాట్లాడించాలనుకుంటున్నారట. అందుకే 'రియల్ వాయిస్'లను ఎంపిక చేయాలనుకుంటున్నారని భోగట్టా. రాజమౌళి టీమ్ ప్రస్తుతం ఈ ఆడిషన్స్ చేసే పని మీద ఉందని తెలిసింది. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా మొత్తం 120 దేశాల్లో 2027 ఏప్రిల్ 7న విడుదల కానుంది.